## ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి శిక్షణ

4





# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )

గురువారం 13 ఫిబ్రవరి 2025 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ


# రైతులు అధిక లాభం వచ్చేలా వ్యవసాయ సాగు చేయాలి





- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- పెండింగ్ సన్న రకం బోనస్ పై నివేదిక సిద్ధం చేయాలి
- బ్యాంకుల వద్ద పెండింగ్ ఉన్న రైతు వివరాల సవరణ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి
- పంట పొలాలకు 2 మట్టి రోడ్డులను వెంటనే ఏర్పాటు చేస్తాం
- కొత్త స్మశాన వాటిక నిర్మాణానికి గ్రామ తీర్మానం తీయాలి
- ముదిగొండ మండలం గోకినేపల్లి గ్రామంలో రైతులను కలిసి మాట్లాడిన జిల్లా కలెక్టర్

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

ఉన్న భూమి వనరుల నుంచి రైతులు అధిక ఆదాయం సంపాదించేలా వ్యవసాయ సాగు చేయాలని, అధునాతన పద్ధతులను పాటించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళ వారం జిల్లా కలెక్టర్, ముదిగొండ మండలం గోకినేపల్లి గ్రామంలో పర్యటించి రైతులతో వివిధ అంశాలపై ముచ్చటించారు. మిగతా 2లో..

## మిర్చి రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

- కనీస మద్దతు ధర 25 వేలు చెల్లించాలి
- ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలి
- సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్

2



## మిర్చికి రూ.20వేలు చెల్లించాలి

3





## నూతన వధూవరులను ఆశీర్వదించిన కేటీఆర్, వద్దిరాజు

3

## కులగణన సమగ్రంగా చేపట్టాలి

- ఎంపీ వద్దిరాజు డిమాండ్



హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్

కులగణన సర్వే అశాస్త్రీయంగా జరిగిందని, తప్పుల తడకగా ఉందని తమ పార్టీ లెక్కలతో సహా నిరూపించడంతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి రీసర్వేకు అంగీకరించడాన్ని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర స్వాగితించారు. ఈసారైనా ఎన్యూమరేటర్స్ ఇంటింటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని, వాటన్నింటిని క్రోడీకరించి సరైన లెక్కలు వెల్లడించాలని ఒక ప్రకటనలో ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓబీసీలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్స్ కల్పించడంతో పాటు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నదని.. రాష్ట్ర ఏర్పాటు జరిగిన తొలినాళ్లలోనే ఈమేరకు మహానేత కేసీఆర్ గారు అసెంబ్లీలో తీర్మానం చేయించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. బీఆర్ఎస్ చేసిన తీర్మానానికి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిల పక్షాన్ని ప్రధాని నరేంద్రమోదీ వద్దకు తీసుకెళ్లి చట్టసభల్లో 33శాతం, స్థానిక సంస్థల ఎన్నికలలో 42 రిజర్వేషన్స్ బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని ఎంపీ వద్దిరాజు కోరారు. అలాగే,ఓబీసీల సమగ్రాభివృద్ధికి కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాల్సిందిగా ప్రధానికి విజ్ఞప్తి చేయాలని సలహానిచ్చారు. మంత్రిమండలిలో ఖాళీగా ఉన్న ఆరు స్థానాలలో నాలుగింటిని బీసీలకిచ్చి ప్రాధాన్యత శాఖలు కేటాయించాలని ఎంపీ వద్దిరాజు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు.

## ప్రతిభే భవితకు గీటురాయి..

- యం. ఇ. ఒ. కెవిశైలజాలక్ష్మి



ఖమ్మం టౌన్, కెరటం న్యూస్ ప్రతినిధి

విద్యార్థుల నేటి ప్రతిభే వారి బంగారు భవిష్యత్తు కు పునాదులని ఖమ్మం అర్బన్ మండల విద్యాధికారి కె. వి. శైలజాలక్ష్మి అన్నారు. పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పదవతరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభాపాటవ పరీక్షల్లో విద్యార్థులు తమ ప్రతిభను చూపారు. మండల స్థాయిలో ప్రధమ బహుమతి నిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బల్లేపల్లి విద్యార్థిని చందా భావన, ద్వితీయ బహుమతి మోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. రోషిణి, తృతీయ బహుమతి నిమోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని యం డి ఆయేషాపర్విన్ సాధించి జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికయ్యారు. మండలస్థాయి ప్రతిభా పాటవ పరీక్ష విజేతలకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ తరపున జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు మండల విద్యాధికారి కెవి శైలజాలక్ష్మి, ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య సంయుక్తంగా అందించి, అభినందించారు.ముందుగా మండల స్థాయి ప్రతిభా పాటవ పరీక్షను మండల విద్యాధికారి కెవిశైలజాలక్ష్మి ప్రారంభించగాకార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, పెన్షనర్ల సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతులు అధిక లాభం వచ్చేలా వ్యవసాయ సాగు చేయాలి

(మొదటిపేజీ తరువాయి..)

రైతు రుణమాఫీ, సన్న రకం వడ్లకు బోనస్, ఇతర సమస్యలపై రైతుల వెంబటి పంట పొలాల్లో బురదలో చెప్పులు లేకుండా నడుస్తూ కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, 2 లక్షల రూపాయల వరకు రుణాలు ఉన్న లక్ష 34 వేల మంది రైతుల వరకు ఖమ్మం జిల్లాలో రుణమాఫీ జరిగిందని, ఆధార్ కార్డు వివరాల నమోదు, బ్యాంకు సాంకేతిక కారణాల వల్ల కొంత మందికి రుణమాఫీ అందలేదని, సంబంధిత రైతుల జాబితా ప్రభుత్వానికి పంపామని అన్నారు. జిల్లాలో సన్న రకం ధాన్యం కొనుగోలు చేసి బోనస్ క్రింద దాదాపు 140 కోట్లు చెల్లించామని కలెక్టర్ తెలిపారు. సన్న రకం ధాన్యం పెండింగ్ బోనస్ వివరాలను రైతుల వారిగా ట్రాక్ చేయాలని, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో సంప్రదిస్తూ త్వరలో రైతులకు పెండింగ్ బోనస్ చెల్లిస్తామని అన్నారు.సాదా బైనామా దరఖాస్తులు కొత్తగా నమోదు చేసుకునేందుకు ఇప్పుడు అవకాశం లేదని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రభుత్వ నిర్ణయం ప్రకారం అవకాశం వస్తే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకం లో భూమి తక్కువగా నమోదయిందని తెలుపగా, ఎంజాయ్మెంట్ సర్వే చేసి సమస్య పరిష్కారానికి అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతుల బ్యాంకు వివరాలు సరిగ్గా నమోదు కాలేదని పంపినప్పటికి బ్యాంకులలో పెండింగ్ ఉండటం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే సంబంధిత రైతుల వివరాలను సవరించి దరఖాస్తులను బ్యాంకు మేనేజర్లు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, లీడ్ బ్యాంకు మేనేజర్ కు ఫోన్ చేసి ఆదేశించారు.



ప్రభుత్వం అమలు చేసే రైతు రుణ మాఫీ, సన్న రకం ధాన్యం బోనస్, రైతు సంక్షేమ పథకాల డబ్బులు ఎట్టి పరిస్థితుల్లో ఇతర రుణాల క్రింద జమ చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామంలో 3 వేల జనాభాకు ఒకే స్మశాన వాటిక ఉందని, మరో స్మశాన వాటిక ఏర్పాటుకు గ్రామ పంచాయతీ తీర్మానం చేసి పంపాలని, తప్పనిసరిగా మంజూరు చేస్తామని కలెక్టర్ అన్నారు. ఎటువంటి పంటలు సాగు చేస్తున్నారు, విత్తనాలు, ఎరువులుఅందుబాటులో ఉన్నాయా వంటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పెద్ద రైతులతో ఇతర రైతులకు సాగు పద్ధతులు, వ్యవసాయ అధికారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో అమలు అవుతున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. పాల దిగుబడి వచ్చే విధంగా చూడాలని, పాలల్లో కొవ్వు శాతం అధికంగా వచ్చేలా పశువులకు మేత వేయాలని కలెక్టర్ తెలిపారు. పంట పొలాలకు వెళ్లే విధంగా రెండు మట్టి రోడ్లను వేస్తామని, తర్వాత డాంబర్ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఏ.ఓ., ఏ.ఈ.ఓ. లు, రెవిన్యూ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

- కనీస మద్దతు ధర 25 వేలు చెల్లించాలి
- ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలి
- సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్





వైరా, కెరటం న్యూస్ ప్రతినిధి

మిర్చి రైతులకు మార్కెట్ లో 25 వేలు కనీస మద్దతు ధర కల్పించి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని అష్ణగుర్తి గ్రామంలోని మిర్చి రైతుల కల్లాలను సిపిఐ(ఎం) నేతలు సుంకర సుధాకర్, తూము సుధాకర్ లతో కలిసి భూక్యా వీరభద్రం పర్యటించారు. మిర్చి రైతులతో మాట్లాడి పెట్టిన పెట్టుబడి, ప్రస్తుత మార్కెట్ లోని ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో సరైన రేటు లేక కల్లాలోనే మిర్చి పంటను ఉంచామని, మద్దతు ధర లేకపోతే కుటుంబాలు అప్పులపాలు అవుతుందని, ప్రభుత్వాలు ఆదుకోకపోతే మరణమే శరణం అని రైతులు చిత్తారు వెంకట నర్సయ్య, రామారావు సిపిఎం బృందం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఓదార్చిన అనంతరం భూక్యా వీరభద్రం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 25వేల కనీసం మద్దతు ధరను మిర్చి పంటకు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు వెంటనే చేయాలని కోరారు. ఫిబ్రవరి 17న ఖమ్మం మిర్చి మార్కెట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాకు సిపిఎం పార్టీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని తెలిపారు. మిర్చి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని మిర్చి రైతుల ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు స్పందించకపోతే అధిక సంఖ్యలో రైతులను సమీకరించి మిర్చి రైతుల పక్షాన నికరంగా పోరాడుతామని తెలిపారు.

# మిర్చికి రూ.20వేలు చెల్లించాలి



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

అఖిలభారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర, జిల్లా ప్రతినిధి బృందం వందలాది మంది రైతులతో ఖమ్మభ్య బుధవారం ఖమ్మం మిర్చి మార్కెట్ను సందర్శించింది. ఈ బృందంలో సంఘం రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు కెచ్చల రంగయ్య, ఉప్పల ప్రభాకర్, ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మలీధు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, చంద్ర అరుణ, కోలేటి నాగేశ్వరరావు, కుమ్మకో వుంటే కలదు నాగేశ్వరరావు పాశం అప్పారావు కే లోతు లక్ష్మణ్ తదితర రైతు నాయకులు పాల్గొన్నారు. ఈ ప్రతినిధి బృందం మార్కెట్లో జరుగుతున్న పరిస్థితులను పరిశీలించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెచ్చలరంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉప్పల ప్రభాకర్, మాజీ శాసనసభ్యులు మరియు



ఉపాధ్యక్షులు గుమ్మడి నరసయ్య లు మాట్లాడుతూ గత సంవత్సరం క్వింటాలకు 20వేల నుంచి 25వేల రూపాయలు ధర పలికిన మిర్చి ఈ రోజున జెండా పాట 12 వేల నుంచి 13వేల మాత్రమే పలుకుతుందని సగం ధరలు తగ్గిన ఫలితంగా రైతాంగం గుండె ఆగిపోయేంత పరిస్థితులు ఏర్పడ్డాయని వారు ఆందోళన వెలిబుచ్చారు .ధర తగ్గడానికి అంతర్జాతీయ మార్కెట్ ఒక కారణంగా చూపుతూ వ్యాపారులు సిండికేట్ అవతారం ఎత్తి కృత్రిమంగా ధర తగ్గిస్తున్నారని అంతేకాకుండా బయట మార్కెట్కు వచ్చి కొనుగోలు చేసిన వ్యాపారులు,జెండా పాటలో పాల్గొనే విధంగా ఏ ఒక్క ఖరీదుదారు రాకపోవడం వీరి ఆలోచనలు మనం అర్థం చేసుకోవచ్చని వారన్నారు. రైతు మిర్చి అమ్ముకోగా వచ్చిన డబ్బుపై చెల్లించే సమయంలో చట్టబద్ధంగా తీసుకోవాల్సిన కమిషన్ రెండు రూపాయల కాగా 4 నుంచి 7% వరకు కమిషన్ తీసుకుంటున్నారని రైతులు ఆవేదనతో మా దృష్టికి తీసుకువచ్చారని ఈ విషయాన్ని అధికారులు నిరోధించాలని వారు డిమాండ్ చేశారు. హమాలీ చార్జీ ఖరీదారు భరించాల్సి ఉండగా అది రైతులపై మోపుతున్నారని, సరుకు ఖరీదు చేసిన ధరకు కాకుండా కాటా సమయంలో అనేక కొర్రీలు పెట్టి 400 రూపాయల నుంచి 700 వరకు ధర తగ్గిస్తున్నారని, కాళీ బస్తా ఖరీదు 70రూపాయలు ఉండగా కేవలం 25 రూపాయలే చెల్లిస్తున్నారని దీనివల్ల రైతు దోపిడీకి గురవుతున్నారని, మార్కెట్ పాలకవర్గం చేతిలో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించకపోవడం సరికాదని వెంటనే ఈ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రతి పంటకు 500 రూపాయలు బోనస్ ఇస్తామని ప్రకటించారని ఈ మిర్చి పంట పెట్టుబడి పెరుగుతుందని అందువల్ల కింటాకు వెయ్యి రూపాయలు బోనస్ ఇవ్వాలని ,అలాగే కోల్డ్ స్టోరేజ్ లో రైతుల సరుకుని నిల్వఉంచుకునే విధంగా నిల్వ ఉన్న సరుకుకు 5 లక్షల వరకు వడ్డీ లేకుండా రుణ సౌకర్యం కల్పించాలని , మిర్చిపంటను ఆహార పంటగా భావించి కనీసం మద్దతు ధర జాబితాలో చేర్చి స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా మిర్చి క్వింటాకు 35 వేల రూపాయలు ధర నిర్ణయించాలని, మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నామన్నారు . అనంతరం మార్కెట్ ఛైర్మన్, కార్యదర్శులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధి బృందంతో పాటు సంఘం జిల్లా నాయకులు కుర్ర ఎంకన్న, ధరావత్ లక్ష్మణ్, గూగులోత్ తేజ ఇలా, వడ్డే వెంకటేశ్వర్లు బందెల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కేటీఆర్, వద్దిరాజు





**హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్**

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు తదితర ప్రముఖులతో కలిసి నూతన వధూవరులు సంఘమిత్ర-సాయి రమ్యలకు తమ ఆశీస్సులు అందజేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు,మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే తమ్మినేని వీరభద్రం-ఉమల కుమారుడు సంఘమిత్ర పెళ్లి సినీ నిర్మాత కట్టా రాంబాబు-శారదల కూతురు సాయి రమ్యతో బుధవారం రాత్రి జరిగింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్ జేఆర్సీ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ పెళ్లికి ఎంపీ రవిచంద్ర మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి అజయ్ కుమార్, ఎమ్మెల్సీ మధులతో కలిసి నూతన వధూవరులకు పుష్పగుచ్ఛాలిచ్చి పూలుజల్లి ఆశీర్వదించారు.నూతన వధూవరులు సంఘమిత్ర-సాయి రమ్యల తల్లిదండ్రులు వీరభద్రం-ఉమ, రాంబాబు-శారద, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, బీఆర్ఎస్ నాయకులు ఆర్జేసీ కృష్ణ,చంద్రావతి తదితరులు నూతన వధూవరులు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు చెప్పారు.

## మద్దులపల్లి మార్కెట్‌లో కొనుగోళ్ళు ప్రారంభం



**ఖమ్మం వ్యవసాయం, కెరటం న్యూస్**

వ్యవసాయ మార్కెట్ కమిటీ మద్దులపల్లి యార్డ్ కార్యకలాపాలు (క్రయ విక్రయాలు) మధ్యాహ్నం అదనపు సంచాలకులు మార్కెటింగ్ ఆర్ లక్ష్మణుడు పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభం చేసినారు. ఈ కార్యక్రమం లో జిల్లా మార్కెటింగ్ అధికారి ఆలీం, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఈఈ ఎల్లెష్, మరియు టెక్నికల్ కన్సల్టెంట్ రావి ఉమామహేశ్వరరావు, ఏఎంసీ మద్దులపల్లి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతు వెంకటేశ్వర్లుని మరియు వ్యాపారస్తులను అదనపు సంచాలకులు గారు ఘనంగా సన్మానించారు.

## ఆందోళన బాటలో మున్నూరు కాపులు



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్ ప్రతినిధి**

బీసీ కులగణనలో మున్నూరు కాపులను 18 శాతం నుండి 8 శాతం కు తగ్గించడంతో ఆందోళనా బాట పట్టనున్నారు. ఈమేరకు బుధవారం మున్నూరు కాపు వసతి గృహం లో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య సూచనల మేరకు దీనికి సంబందించిన పలు నిర్ణయాలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఈనెల 14న మున్నూరు కాపు లలోని అన్ని వర్గాలతోజిల్లా కలెక్టర్ కు,17న ముదిగొండ తహశీల్దార్ లకు వినతి పత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాలను పార్టీలకు అతీతంగా చేపట్టాలని తీర్మానించారు. సమావేశం లో భాగంగా మున్నూరు కాపు సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ మాట్లాడుతూ మున్నూరు కాపుల రిజర్వేషన్ ను తగ్గించడం తగదన్నారు. ఈ విషయమై జరిగే ఆందోళనలో బీసీ కులాలు కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమం లో పొదిల రవికుమార్, కొత్తా సీతారాములు, నరాల నరేష్ ,మేకల శ్రీనివాస్, మేకల నాగేందర్, జంగిలి రమణ, సత్యాల మధు,మూల గుండ్ల శ్రీహరి, పసుపులేటి నాసరయ్య, పసుపు లేటి వెంకట్, రాపర్తి రాజా, జీవీవీ ఎల్ నరసింహ రావు,మాటేటి కిరణ్ , పసుపులేటి శ్రీను,పగడాల నరేందర్, తిరుమల శెట్టి జయప్రకాష్, బొమ్మిశెట్టి రమేశ్ మాటేటి రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- **జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ**
- **ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి శిక్షణ**

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**









జిల్లాలో నిర్వహించు ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ అన్నారు. ఈ నెల 27న జిల్లాలో నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారిణి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రతి ఒక్కరికి అనుభవం ఉందని, ఎక్కడా తేలికగా తీసుకోకుం డా ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో 4089 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, వీరి కోసం 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, నిబంధనలు పాటిస్తూ పోలింగ్ సజావుగా జరపాలని అన్నారు. నామినేషన్లు ఉపసంహరణ గడువు ఫిబ్రవరి 13న ముగుస్తుం దని, పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు గురువా రం వరకు తెలుస్తాయని అన్నారు. ఎన్నికల విధుల పట్ల ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని, శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్ లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి లు పోలింగ్ నిర్వహణపై వివరిస్తూ, ఫిబ్రవరి 27న ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు శాసనమండలి ఎన్నికల పోలింగ్ జరుగనున్నదని, ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై సిబ్బంది అవగాహన కల్పించుకోవా లని, ప్రిఫరెన్షియల్ ఓటింగ్ విధానంతో ఎన్నికలు జరుగుతాయని అన్నారు. బ్యాలెట్ బాక్స్ లను ఓపెన్ చేయడం, క్లోజ్ చేయడం, సీల్ చేసే పద్ధతులపై అవగాహనతో ఉండాలని అన్నారు. ఫిబ్రవరి 26న డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చి పోలింగ్ డ్యూటీ అలాట్మెంట్ ఆర్డర్ తీసుకొని సంబంధిత పోలింగ్ కేంద్రం సిబ్బందితో కలిసి పోలింగ్ సామాగ్రి తీసుకోవాలని అన్నారు. అవసరమైన మేర సరైన బ్యాలెట్ పత్రాలు, ఓటరు జాబితా, ఇతర ముఖ్యమైన పోలింగ్ సామాగ్రి చెక్ లిస్ట్ తయారు చేసుకొని అన్ని అందుబాటులో ఉన్నాయో లేదో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు లైన్లో వచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్ ను గుర్తించి, జాబితాలో అతని పేరు చెక్ చేసుకోవాలని, ఎడమచేతి చూపుడు వేలుకి ఇంక్ పెట్టాలని అన్నారు. పోలింగ్ లో ఓటు వేసేందుకు గుర్తింపు పొందిన ఐడిని ఓటర్లు తమ వెంట తీసుకుని రావాల్సి ఉంటుందని అన్నారు. ఓటర్ గుర్తింపు జరిగిన తర్వాత పోలింగ్ కేంద్రంలో ఉన్న రెండవ అధికారి ఓటరు వివరాలను నమోదు చేసుకొని, ఓటర్ సంతకం తీసుకొని బ్యాలెట్ పేపర్ జారీ చేయాలని, సంతకం చేయని పక్షంలో బ్యాలెట్ పేపర్ జారీ చేయవద్దని అన్నారు. బ్యాలెట్ పేపర్, వాయిలెట్ స్కెచ్ పెన్ తో సహా ఓటర్ కు అందిస్తూ అవసరమైతే ఓటింగ్ విధానాన్ని తెలియజేయాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ లో ఓటు వేసి, బ్యాలెట్ పేపర్ ను మడిచి బ్యాలెట్ బాక్స్ లో వేయాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా పర్యవేక్షించాలని అన్నారు. పోలింగ్ నాడు ఉదయం 7-30 గంటలకు ఖాళీగా ఉన్న బ్యాలెట్ బాక్స్ ను ఏజెంట్లకు చూపించాలని, గ్రీన్ పేపర్ లో ఏజెంట్ల సంతకాలు తీసుకుని సీల్ చేయాలని, బ్యాలెట్ బాక్స్ పై పోలింగ్ కేంద్రం వివరాలు ఉండే విధంగా పేపర్ అతికించాలని, ఓటర్ సీక్రేసి కాపాడేందుకు వీలుగా ఓటింగ్ కంపార్ట్మెంట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ నాడు ప్రతి రెండు గంటలకు ఒకసారి అంటే ఉదయం 10.00, మధ్యాహ్నం 12.00, 2.00 గంటలకు, పోలింగ్ ముగిసిన తరువాత 4.00 గంటలకు పోలింగ్ జరిగిన వివరాల రిపోర్ట్ పంపాలని అన్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటర్ స్లిప్పులు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించాలని అన్నారు. చివరి ఓటర్ ఓటు వినియోగించుకున్న తర్వాత నిబంధనల ప్రకారం బ్యాలెట్ బాక్సులను మూసివేసి సీల్ చేయాలని, ప్రతి ఒక్క సిబ్బంది తన మాన్యువల్ ను ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలని , విధులను పక్కాగా నిర్వహిస్తూ ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చూడాలని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### దళిత ఆర్మీ జవాన్ మనోజ్‌పై దాడి దుండగులపైన

# ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- **కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్**

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**




దళిత ఆర్మీ జవాన్ మనోజ్ పైన కులం పేరుతో దూషించి పోలీస్ స్టేషన్ లోనే గల్లా పట్టుకొని పిడిగుద్దులతో దాడి చేసిన అగ్రకుల పెత్తందారులైన ఉమ్మినేని రమేష్, లగడపాటి సాయిలపైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి బాధితుడైన బూదాల మనోజ్ వచ్చిన సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్, జిల్లా ఉపాధ్యక్షులు నకరికంటి చిరంజీవి, దళిత సంఘాల జిల్లా నాయకులు కుక్కల రాములు, ఆరెంపుల రామనాథం లు ఆయనను కలసి పరామర్శించి ఓదార్చారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ బోనకల్ మండల కేంద్రానికి చెందిన దళితుడైన బూదాల మనోజ్ ఆర్మీలో జవాన్ గా ఉద్యోగం చేస్తూ సెలవుపై తన ఇంటికి వచ్చి ఈ నెల 6న ఖమ్మం నుండి బోనకల్ కు వెళుతున్న క్రమంలో నాగులవంచ పెట్రోల్ బంక్‌లో జరుగుతున్న గొడవను ఆపడం కోసం వెళ్లిన తనపైన అక్రమంగా పెట్టిన కేసు విషయంలో మంగళవారం 11వ తేదిన చింతకా ని పోలీస్ స్టేషన్‌కి వెళ్లి స్థానిక ఎస్ఐ గారితో మాట్లాడుతుండగా బోనకల్ మండలం ఎల్.గోవిందా పురం గ్రామానికి చెందిన గతంలోనే హత్యానేరం కేసులో ఎ ఒన్ ముద్దాయిగా ఉన్న అగ్రకుల పెత్తందారుడైన ఉమ్మినేని రమేష్ తో పాటు అదే గ్రామానికి చెందిన లగడపాటి సాయి లు కలసి తన ముఖంపైన పిడిగుద్దులు గుద్దుకుంటూ గల్లా పట్టుకొని పోలీస్ స్టేషన్ నుండి బయటకు బలవంతంగా లాక్కొచ్చి మాదిగ నా కొడకా, తక్కువ కులం నా కొడకా అంటూ నానా బూతులు తిట్టుకుంటూ నా పైన దాడి చేశారని దళిత సంఘాల నాయకుల ముందు వాపోయాడని వారు తెలిపారు. పోలీస్ స్టేషన్ లోనే దళితుడు పైన దాడి చేస్తే గ్రామీణ ప్రాంతాలలోనీ దళితుల పరిస్థితి ఎట్లా ఉంటుందో పోలీస్ ఉన్నతాధికారులు ఆలోచించాలని వారు కోరారు. దళితుడైన ఆర్మీ జవాన్ మనోజ్ పైన దాడి చేసిన దుండగులపైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, లేనియెడల దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టబోయే ఆందోళనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.